సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 13 । ఆగస్టు । 2025

'మా ఓట్లు గల్లంతయ్యాయంటూ ఓటర్లు వీధుల్లోకి వచ్చి ప్రశ్నిస్తుంటే.. సమాధానం చెప్పేవారు ఎవరు. 'మా ఓట్లు ఎవరో వేశారంటూ' పోలింగ్ కేంద్రం సాక్షిగా నిలబడి సాక్ష్యాలు చూపిస్తుంటే.. జవాబు చెప్పేదెవరు.. పోలీసులే దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయిస్తుంటే.. అడ్డుకునేదెవరు..అడ్డు చెప్పేదెవరు... దొంగ ఓట్లు వేసిన నేతలు పబ్లిగ్గా సెల్ఫీ దిగీ మరి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే.. రాజ్యాంగాన్ని కాపాడేదెవరు.. ఈసీ స్పందిస్తుందా.. కోర్టు సుమోటోగా తీసుకుంటుందా.. చూడాలి.

డీఐజీ.. ఎస్పీ.. ఇవి హోదాలు కాదు.. ఒంటిపై వేసుకున్న యూనిఫాంలోని స్టార్లు.. బ్యాడ్జీలే అస్సలు కాదు.. సమాజానికి ఆదర్శం వీరు.. ఉన్నతోద్యోగులు వీరు.. ఉన్నత చదువులు చదివిన వారు. రేపటి తరానికి స్ఫూర్తిగా నిలవాల్సింది పోయి... 'మచ్చగా' మిగిలిపోతున్నారు. వీరే ఇలా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుంటే.. పచ్చ నేతల మోచేతి నీళ్లు తాగుతుంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేదెవరు. యువత వీరిని ఆదర్శంగా తీసుకుంటే.. దేశ భవిష్యత్తు ఏమవునో.. ప్రస్తుత యువతరం ముందెన్నడూ చూడని ఎన్నిక ఇది. ఇకపై చూడకూడని ఎన్నిక కూడా ఇదే.

న్యూస్‌రీల్

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

సిద్దవటం: మండల పరిధి వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ శ్రీధర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలి



ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్): పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. రామాపురం మండలం చిట్లూరు గ్రామంలో మంగళవారం రైతు సేవా కేంద్ర సిబ్బంది ఈ క్రాప్ చేస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టం, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ రాయితీలు, ఏమి రావాలన్నా ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ చేసుకోని రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అమలు కావన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి, ప్రభావతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ, డంపింగ్ యార్డు పరిశీలన

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్): రామాపురం మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు, జగనన్న కాలనీలను అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో చెత్తసేకరణ చేయాలని, అలాగే డంపింగ్‌యార్డును పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఓబులమ్మలకు సూచించారు. చెత్త సేకరణ అన్నది రాష్ట్ర వ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన జరుగుతున్నదని, చుట్టుపక్కల ఉన్న పొడి, తడి చెత్తనలు వేరుగా చేయించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని పరిసరాల్లో సేకరించిన చెత్తను తప్పకుండా డంపింగ్‌యార్డుకు వచ్చే విధంగా చర్యలు చే పట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం నల్లగుట్టపల్లి గ్రామంలోని హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించి మండలంలో పూర్తి కాని గృహాలను పూర్తి చేయించాలని హౌసింగ్ ఏఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, ఎంపీడీఓ జాషువా, హౌసింగ్ ఏఈ కేఎస్ఎం ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, ఆర్ఐ సమ్మద్‌ఖాన్, వీఆర్ఓ రాధిక, ఏపీఓ పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యాసంతో నైపుణ్యాభివృద్ధి



టింకరింగ్‌డేపై విద్యార్థులకు వివరిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి జగదాంబసెంటర్: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో అభ్యాసం కల్పించి విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందింపచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం కలకడ మండలం బాటవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా టింకరింగ్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలోని అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో మెగా టింకరింగ్ డే నిర్వహించామని తెలిపారు. నిపుణుల ప్రత్యక్ష ప్రమేయం లేకుండా ప్రాజెక్టులను రూపొందించడం నేటి కార్యక్రమం ప్రత్యేకమని అన్నారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ వారు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని అనుసరించి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో విద్యార్థులు వ్యాక్యూమ్ క్లీనర్లను రూపొందించారని అన్నారు. ఇలాంటి స్వయం అభ్యాస కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉపయోగపడే నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారని అన్నారు. జిల్లాలోని అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో ప్రతి వారం ఇలాంటి తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన డీవార్మింగ్ డే నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి టీచర్ శేఖర్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యం వధ.. ధర్మం చెర

ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో పరిహాసమైన ప్రజాస్వామ్యం.. బరితెగించిన పచ్చ మూక.. రాయచోటి రౌడీల వీరంగం

సాక్షి రాయచోటి/రాజంపేట: ఒంటిమిట్టలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్‌లో రిగ్గింగ్ యథేచ్ఛగా సాగింది. మండలంలో 30 పోలింగ్ బూత్‌లు ఉంటే ప్రతి చోట పోలీసులు, ఎన్నికల సిబ్బంది సహకారం ఎల్లో గ్యాంగ్‌కు లభించింది. టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా పోలింగ్ బూత్‌ల్లోకి చొరబడి, ఓటర్ల నుంచి ఓటరు స్లిప్‌లు లాక్కుని వారే ఓటు వేసుకున్నారు. అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులు మిన్నకుండిపోయారు.

మంత్రి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడులు

మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో టీడీపీ శ్రేణులు.. పోలింగ్ బూత్‌లలో వున్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడులు చేశారు. ప్రధానంగా మంటంపంపల్లె, చిన్నకొత్తపల్లె, గంగపేరూరు, నడింపల్లె తదితర పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచి ఏజెంట్లను బయటికి లాగి పడేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ సంఘటనలతో పోలింగ్ బూత్‌ల వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ నేతల యత్నం

సమాచారం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి, ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ గోవిందరెడ్డిలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా పోలింగ్ బూత్ వద్దకి చేరుకున్నారు. ఆ సమయంలో టీడీపీ నేతల దౌర్జన్యానికి అడ్డుతగులుతున్నారని భావించి.. వైఎస్ఆర్‌సీపీ నేతలను అరెస్ట్ చేయాలని పోలీసులకు అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో వైఎస్ఆర్‌సీపీ నేతలను అరెస్ట్ చేసి ఒంటిమిట్ట, కడప రిమ్స్, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. తరువాత సాయంత్రం విడుదల చేశారు.



టీడీపీ నేతల దౌర్జన్యంపై పోలీసులను ప్రశ్నిస్తున్న, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ శ్రేణులు

బౌన్సర్లతో టీడీపీ నేతలు హల్‌చల్

అధికార పార్టీ నేతలు తమ వెంట తెచ్చుకున్న బౌన్సర్లతో పోలింగ్ బూత్‌ల వద్ద హల్‌చల్ చేశారు. టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు, మరికొందరి నేతల వెంట బౌన్సర్లు కనిపించడం వివాదానికి దారి తీసింది.

ఓటు హక్కును కోల్పోయిన ఒంటిమిట్ట వాసులు

జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో ఒంటిమిట్ట వాసులు ఓటు హక్కును కోల్పోయారు. పోలింగ్ బూత్‌లలో కూడా ఓటు వేసే పత్రాలను సిబ్బంది, పచ్చమూకలు కలిసి.. పోలీసులు సహకారంతో ఇతరుల ఓటును టీడీపీ అభ్యర్థికి వేసుకున్నారు. అడిగితే దౌర్జన్యంగా పోలీసు సహకారంతో బయటికి పంపించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓటు తమ చేతిలో లేకుండా పోయే సరికి పలువురు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందంటూ పెదవి విరిచారు.

రాయచోటి రౌడీలపై ఆగ్రహం

పవిత్ర పుణ్యక్షేత్రం ఉన్న ఒంటిమిట్టలో రాయచోటి రౌడీల వీరంగంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్కృతిని తీసుకొచ్చిన పచ్చనేతల తీరు తెన్నులపై విరుచుకు పడుతన్నారు. బయటి వారిని రప్పించి, దౌర్జన్యం చేసిన సంఘటనలతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై ఒంటిమిట్టలోని అన్ని సామాజికవర్గ ఓటర్లలో సానుభూతి పెరిగింది. ఇలాంటి సంస్కృతి ఇక్కడ అక్కర్లేదని కొంత మంది పచ్చనేతలు తీరుతెన్నులపై విరుచుకు పడుతన్నారు.



ఒంటిమిట్ట మండల పరిధిలోని పోలింగ్ కేంద్రంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పోలీసింగ్ ఫెయిల్యూర్

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలీసింగ్ ఫెయిల్యూర్ అయింది. ఈ రెండు స్థానాల్లో పేరుకు మాత్రమే పోలీసు అధికారులు, సిబ్బందిని కలిపి దాదాపు 1400 మందిని బందోబస్తు విధులకు నియమించినట్లు ఉన్నతాధికారులు ప్రచారం చేశారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిఘా వుంచామని ఆర్భాటంగా చెప్పుకొచ్చారు. గత కొన్ని రోజులుగా కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పకడ్బందీగా బందోబస్తు విధులను నిర్వహిస్తున్నామని ప్రచారం చేసుకున్నారు. కానీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సమయంలో మాత్రం టీడీపీ వారికే వత్తాసు పలుకుతూ, వారు ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, దాడులకు తెగబడినా కేవలం ప్రేక్షకపాత్రను పోషించారనే చెప్పవచ్చు.

- ఒంటిమిట్ట మండలంలోని 30 పోలింగ్ కేంద్రాలలో ఉదయం సాఫీగా ప్రారంభమైన పోలింగ్ 10 గంటల సమయం నుంచి సీన్ మారిపోయింది. టీడీపీ రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాజంపేట నియోజకవర్గ నాయకుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఏజెంట్లను బెదిరించి బయటికి పంపించారు.

పులివెందులలో విష సంస్కృతికి బీజం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో విష సంస్కృతి బట్టబయలైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికలు జరిగాయి. వేలాది మంది టీడీపీ అల్లరి మూకలవల్ల ఓటర్లు, ఏజెంట్లు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టలేదు. పులివెందుల జెడ్పీటీసీ పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె పోలింగ్ బూత్‌లను మంగళవారం టీడీపీ మూకలు ఆక్రమించుకున్నారు. అలాగే టీడీపీ నాయకులు సాక్షి వాహనాన్ని చుట్టుముట్టి వాహనాన్ని బాది తాళాలు లాక్కొన్నారు., చొక్కా పట్టి కిందకు దించే ప్రయత్నం చేశారు. కొత్తపల్లిలో 'సాక్షి' మీడియా వాహనాలు ధ్వంసం చేశారు. ఎర్రిపల్లె, కొత్తపల్లెల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనంద్‌పై టీడీపీ అల్లరి మూకల దాడి చేశారు. తుమ్మలపల్లె, కనంపల్లెలలో కట్టెలు పట్టుకుని టీడీపీ మూకలు గొడవలు చేశారు. తుమ్మలపల్లెలో షామియానా వేసి టిఫిన్, భోజనాలు ఏర్పాటు చేశారు. అచ్చివెల్లిలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను టీడీపీ నాయకులు అడ్డుకున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. మోట్నూతలపల్లెలో టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ వాహనాలను ధ్వంసం చేశారు. కొత్తపల్లె, నల్లగొండువారిపల్లె, తుమ్మలపల్లె పోలింగ్ బూత్‌లలోకి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అనుమతించకుండా ఆక్రమించుకున్నారు. ఎర్రిపల్లెలో పోలింగ్ బూత్‌ను ఆధీనంలోకి తీసుకుని ప్రజలు వెళ్లకుండా అడ్డుకున్నారు.

ప్రియురాలిని దూరం చేశారని..


ప్రేమికుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు ప్రయత్నించిన బయ్యారెడ్డి

మదనపల్లె రూరల్ : పెద్దలను ఎదిరించి ప్రియురాలిని పెళ్లి చేసుకుంటే, కేసు పెడతామని బెదిరించి, స్టేషన్‌కు పిలిపించి తమను విడదీశారని మనస్థాపంతో ప్రేమికుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. నీరుగట్టువారిపల్లె యోగివేమన వీధికి చెందిన కొండారెడ్డి, సావిత్రమ్మల దంపతుల కుమారుడు బయ్యారెడ్డి (21) ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇంటర్మీడియట్ చదివే సమయంలో కొండామారిపల్లెకు చెందిన భవిత (21)ను ప్రేమించాడు. నాలుగేళ్లుగా ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఈనెల 7వతేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి కాణిపాకంలో వివాహం చేసుకున్నారు. అనంతరం బెంగళూరు వెళ్లారు. ఈ క్రమంలో భవిత తల్లిదండ్రులు తాలూకా పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వారిని 9వతేదీన మదనపల్లె పోలీసు స్టేషన్‌కు రప్పించారు. ఇరువురు మేజర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం భవిత తాను ఏడాది పాటు తల్లిదండ్రులతోనే ఉంటానని, బయ్యా రెడ్డి ప్రవర్తనలో మార్పువస్తే తల్లిదండ్రులను ఒప్పించి కాపురానికి వెళ్తానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చి తల్లిదండ్రులతో వెళ్లింది. ఈ క్రమంలో ప్రియురాలు దూరమైందన్న మనస్థాపంతో బయ్యారెడ్డి మంగళవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బయ్యారెడ్డి, అతని తండ్రి కొండారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ముందు వరకు తనతో ఉంటానన్న భవిత కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులతో పాటు వెళ్లటంలో పోలీసులు కీలకంగా వ్యవహరించి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ విషయమై సీఐ కళా వెంకటరమణను వివరణ కోరగా ప్రేమ వివాహం చేసుకున్న బయ్యారెడ్డి, భవితలకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ మాత్రమే ఇచ్చామని, భవిత రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చి తల్లిదండ్రులతో వెళ్లిందన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణమ్మ

మదనపల్లె రూరల్ : ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మారుతీ నగర్ కు చెందిన వెంకటేష్ భార్య కృష్ణమ్మ (44) కుటుంబ సమస్యల కారణంగా సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

తల్లిదండ్రులు మందలించారని..

తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె అయోధ్య నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ఉదయ్ కుమార్ (25) నాలుగు రోజులపాటు ఇంటికి రాకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వచ్చిన కుమారుడిని తల్లిదండ్రులు పద్ధతి మార్చుకోవాలంటూ మందలించారు. దీంతో మనస్థాపం చెందిన ఉదయ్ కుమార్ ఇంటి వద్ద నిద్రమాత్రలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే యువకుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ కోసం వెళ్తూ.. వృద్ధురాలి మృతి



మృతి చెందిన చిన్న పాపమ్మ

మదనపల్లె రూరల్ : అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు పడలేదన్న విషయమై ఆందోళన చెందుతూ, ఎందుకు పడలేదో కనుక్కునేందుకు సచివాలయానికి బయలుదేరిన వృద్ధురాలు ఆటో బోల్తా పడటంతో మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ టీకులపాలెం పందివారిపల్లెకు చెందిన పగడాల వెంకటరమణ భార్య చిన్న పాపమ్మ (66) తనకు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా నిధులు అందకపోవడంతో, ఈ విషయమై సచివాలయానికి బయలుదేరింది. టీకులపాలెం వద్ద రామసముద్రం మండలం అజ్జిరెడ్డిగారిపల్లెకు చెందిన రామిరెడ్డి ఆటోలో ఎక్కింది. ఆటో బొమ్మనచెరువుకు వస్తుండగా, మార్గమధ్యంలోని లాభాల గంగమ్మ గుడికి సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా బొలేరో వాహనం రావడంతో, వాహనాన్ని తప్పించేందుకు ఆటోను పక్కకు తిప్పగా అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న చిన్న పాపమ్మ కిందపడి తీవ్రంగా గాయపడింది. ఆటో డ్రైవర్ రామిరెడ్డి సైతం స్వల్పంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలోని వైద్యులు పరీక్షించి చికిత్స అందించే లోపే చిన్నపాపమ్మ పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

మదనపల్లె రూరల్ : అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. మదనపల్లెలో జరుగుతున్న సీపీఐ అన్నమయ్య జిల్లా రెండో మహాసభలు మంగళవారం ముగిశాయి. మహాసభల ముగింపు సమావేశంలో జిల్లా నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కార్యవర్గంతో పాటు జిల్లా సమితి సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన పి.మహేష్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటిప్రాజెక్టులను తక్షణమే పూర్తిచేయాలన్నారు. కడప నుంచి రాయచోటి, మదనపల్లె మీదుగా బెంగళూరు రైల్వేలైను పనులు తిరిగి ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు మనోహర్‌రెడ్డి, సిద్ధిగాల శ్రీనివాసులు, దేవర, సాంబశివ, సుధీర్, నియోజకవర్గ కార్యదర్శి మురళీ, జిల్లా నాయకులు రంగారెడ్డి, జక్కల వెంకటేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పి.మహేష్

టీటీడీ అధికారులు వేధిస్తున్నారు

- ఈ వయస్సులో ఎక్కడికి వెళ్లి జీవించాలి
- వృద్ధ దంపతుల ఆవేదన

గుర్రంకొండ : గత ఎన్నికల్లో టీడీపీకే ఓట్లు వేశాము.. మా అంగడిపైనా టీడీపీ జెండాలే ఉన్నాయి.. అయినా సరే టీటీడీ అధికారులు, పోలీసులు మా అంగడిని ఖాళీ చేయాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారు. వీరికి పరోక్షంగా టీడీపీ నాయకులే వత్తాసు పలుకుతున్నారు. ఈ వయస్సులో మేము ఎక్కడికి వెళ్లి జీవించాలి అంటూ మండలంలోని తరిగొండ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఆవేదన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎస్. అబ్దుల్ రౌఫ్, ఎస్. గులాబ్ జాన్ దంపతులు గ్రామంలోని రామాపురం క్రాస్ వద్ద రోడ్డుపక్కనే బజ్జీల దుకాణం నిర్వహించుకొంటూ జీవనం సాగిస్తున్నారు. 15 సంవత్సరాలుగా ఇదే వీరికి జీవనాధారం. బజ్జీల దుకాణం పైన రెండు టీడీపీ జెండాలను కట్టుకొని వ్యాపారం చేసుకొంటున్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు వీరిపై కక్ష గట్టి వేధింపులకు దిగారు. వీరు దుకాణం నిర్వహిస్తున్న స్థలం టీటీడీకి చెందింది. ఏళ్ల తరబడి టీటీడీ అధికారులకు వీరు అద్దెలు చెల్లిస్తూ రసీదులు పొందారు. వీరితో పాటు ఇంకా పలు దుకాణాలను ఈ స్థలాల్లో పలువురు నిర్వహించుకొంటున్నారు. అయితే గత కొంతకాలంగా గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు తమ దుకాణం తొలగించాల్సిందిగా టీటీడీ అధికారులు, పోలీసులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు వృద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు. సాధారణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత ఇప్పటికే మూడు చోట్ల దుకాణం పెట్టుకోగా అన్ని చోట్ల ఖాళీ చేయించారని వారు వాపోయారు. కనీసం ఈ స్థలంలోనైనా దుకాణం నిర్వహించుకొందామంటే టీడీపీ నాయకులు అధికారులను, పోలీసులను తమ పైకి పంపించి వేధిస్తున్నారని ఆవేదన చెందారు. మాతో పాటు ఇంకా పలువురు ఇక్కడ దుకాణాలు నిర్వహించుకొంటున్నా అధికారులు వారిని వదిలిపెట్టి మమ్మల్నే ఖాళీ చేయమంటూ వేధిస్తుండడం దారుణమన్నారు. టీటీడీకి చెల్లించిన రసీదులు చూపించినా కనికరించడం లేదని వారు పేర్కొన్నారు. తమకు అధికారులు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



టీటీడీ స్థలం అద్దెకు సంబంధించి గతంలో చెల్లించిన రసీదులను చూపిస్తున్న వృద్ధ దంపతులు

హర్ ఘర్ తిరంగాలో అందరూ పాల్గొనాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ప్రతి పౌరుడు జాతీయ సమగ్రత, ఐక్యత చాటుకునేలా కార్యక్రమాల్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం రాయచోటిలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి బంగ్లా సర్కిల్ వరకు జిల్లా పర్యాటక శాఖ, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్, మండల కేంద్రాల్లో హర్‌ఘర్ తిరంగాను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపడానికి గుర్తుగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ రాధమ్మ, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, జిల్లా పర్యాటక శాఖ నాగభూషణం, జిల్లా అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో కనుల పండువగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని సూచించారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, వేదికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ఆయా శాఖల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏఎస్పీ వెంకటాద్రి, డీఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి